సాక్షి
కుమురం భీం

ఆదివారం | 17 | నవంబర్ | 2024



బాసరలో ఉద్రిక్తత

ఏబీవీపీ ట్రిపుల్ ఐటీ ముట్టడి పిలుపుతో బాసరలో శనివారం ఉద్రిక్తత నెలకొంది. బాసరవైపు వెళ్లే ఏబీవీపీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. 8లో▸



రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు

నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో రాష్ట్రస్థాయి అండర్–17 బాలబాలికల బేస్‌బాల్ పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 8లో▸

గరిష్టం/కనిష్టం
30.0 /14.8

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. చలి ప్రభావం పెరుగుతుంది. అర్ధరాత్రి నుంచి మంచు ఎక్కువగా కురుస్తుంది.

న్యూస్‌రీల్

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌అర్బన్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ పరీక్షల జిల్లా సహాయ అధికారి ఉదయ్‌బాబు హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్‌లు సదానందం, ప్రవీణ, స్వర్ణలత, సతిదేవి, యం.వెంకటరమణ, సిబ్బంది సలీం, రామయ్య, గోపి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, ఉదయ్‌కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

20న తుడుందెబ్బ మహాసభ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కోట్నాక విజయ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో ఈనెల 20న నిర్వహించనున్న తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా మహాసభను విజయవంతం చేయాలని రాష్ట్ర కో కన్వీనర్ కోట్నాక విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని తుడుందెబ్బ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాల నూతన కమిటీలను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఆదివాసీ హక్కులు, అస్తిత్వాన్ని, చట్టాలను కాపాడుకునేందుకు దిశా నిర్దేశం చేసుకుంటూ భవిష్యత్ కార్యాచరణకు ప్రణాళిక సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఆదివాసీ విద్యార్థి, ఆదివాసీ మహిళ, యువజన సంఘాలు, నిరుద్యోగ, రైతుసంఘం నాయకులు తప్పకుండా హాజరుకావాలని కోరారు. సమావేశంలో జిల్లా కో కన్వీనర్ మారుతి, రామ్‌షావ్, భగవంత్‌రావ్, ప్రకాష్, రాజు, దౌలత్ రావ్, తదితరులు పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో పారా మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు తీసుకోనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎంసీజీలో 30, డీఎంఎల్‌టీ 30 సీట్లు ఉన్నాయని, ఇంటర్‌లో బైపీసీ పూర్తి చేసిన విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందని, ఎంపీసీ గ్రూపు వారికి కూడా అవకాశం కల్పిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 20 లోపు దరఖాస్తు చేసుకుంటే 25న ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి డిసెంబర్ 2 నుంచి తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గలవారు బోనఫైడ్ కుల, ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, ఫొటోతో ఆన్‌లైన్ https:// tgpmb. telangana. gov. in దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'చలో ఢిల్లీ' విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న క్రిష్ణమాచారి

కౌటాల: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 3న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు వెలిశాల క్రిష్ణమాచారి అన్నారు. శనివారం కౌటాల విద్యావనరుల కేంద్రం ఎదుట ఎండీఎం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు రూ. 26 వేల వేతనం ఇవ్వాలని, జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు శారద, మండలాధ్యక్షులు పద్మ, వనిత, లక్ష్మి, విమల, తార పాల్గొన్నారు.

గ్రూప్‌-3కి సర్వం సిద్ధం

- నేటి నుంచి పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- జిల్లాలో 18 కేంద్రాలు 4,471 మంది అభ్యర్థులు
- అరగంట ముందే పరీక్ష కేంద్రం గేట్‌కు తాళం
- 92 మంది దివ్యాంగులకు నవోదయలో సెంటర్



జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో నేటి నుంచి గ్రూప్‌–3 పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. వారం రోజుల నుంచి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సైతం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పలుమార్లు అధికారులతో సమీక్ష నిర్వహించారు. పరీక్ష సెంటర్ విజిట్ నిర్వహించారు. 17, 18 తేదీల్లో జిల్లాలోని 18 పరీక్ష కేంద్రాల్లో జరుగనున్న పరీక్షలకు 4,471 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు.

నిర్దేశిత సమయానికి గేట్లు బంద్

గ్రూప్‌–3 పరీక్షలు 17, 18 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. తొలి రోజు రెండు సెషన్లలో, రెండో రోజు ఒక సెషన్‌లో పరీక్ష జరగనుంది. మొదటి రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. 18న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. ఉదయం పరీక్షకు 8:30 నుంచి 9:30 గంటల వరకే అనుమతిస్తారు. మధ్యాహ్నం పరీక్షకు 1:30 నుంచి 2:30 గంటల వరకే అనుమతించి గేట్లకు తాళాలు వేస్తామని సంబంధిత అధికారులు వెల్లడించారు. అభ్యర్థులు నిర్దేశిత సమయానికి పరీక్ష సెంటర్‌కు చేరుకోవాలి. ఎస్కార్ట్ లేకుండా ప్రశ్నపత్రాలు వస్తే తీసుకోవద్దని పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ అయ్యాయి.

జిల్లాలో 18 పరీక్ష కేంద్రాలు

గ్రూప్‌–3 పరీక్షకు 18 కేంద్రాలను ఏర్పాటు చేయగా మొత్తం 4,471 మంది పరీక్ష రాయనున్నారు. ఆసిఫాబాద్‌లో 9 సెంటర్లు, కాగజ్ నగర్‌లో 9 సెంటర్లు ఏర్పాటు చేశారు. పరీక్ష నిర్వహణ కోసం 228 మంది ఇన్విజిలేటర్లు, ప్రతీ సెంటర్ కు ఇద్దరు చొప్పున 36 మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, ఒక సెంటర్‌కు 10 మంది చొప్పున 190 మంది పోలీస్ సిబ్బందితో పాటు ఫ్లయింగ్ స్కాడ్ 4 రూట్‌లకు గానూ 8 మంది, 19 మంది సీఎస్‌లు, సెంటర్‌కు ఇద్దరు చొప్పున 38 మంది హెల్త్ సిబ్బంది ని ఏర్పాటు చేశారు. కలెక్టర్, అదన పు కలెక్టర్, ఎస్పీ పరీక్ష కేంద్రాలను సందర్శించనున్నారు. పరీక్ష కేంద్రాల్లో 17 ఉదయం 8 నుంచి 18 రాత్రి 8గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్ష సందర్భంగా ఎలాంటి అవకతవకలు జరగకుండా అన్ని దశల్లో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రతీ సెంటర్‌కు మూడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఎంట్రన్స్ గేటు వద్ద, సీఎస్ రూంలో, క్లాస్‌రూంలో కెమెరాలు అందుబాటులో ఉంచనున్నారు.

అభ్యర్థులకు సూచనలు...

- పరీక్షకు గంట ముందే సెంటర్‌కు చేరుకోవాలి
- నలుపు లేదా నీలం బాల్‌పాయింట్ పెన్నుతోనే పరీక్ష రాయాలి.
- హాల్‌టికెట్, ప్రభుత్వం జారీ చేసిన ఫొటో గుర్తింపుకార్డు వెంట తెచ్చుకోవాలి.
- సెల్‌ఫోన్, చేతి గడియారం, క్యాలిక్యులేటర్, తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను లోనికి అనుమతించరు.
- చెప్పులు మాత్రమే ధరించి రావాలి. ఆభరణాలు, మెహందీ, టాటూలను వేసుకోరాదు.
- కొన్ని పరీక్ష కేంద్రాల్లో ఏ, బీ సెంటర్లు ఉన్నాయి. జాగ్రత్తగా చూసుకోవాలి.

పటిష్ట బందోబస్తు

జిల్లాలో నిర్వహించే గ్రూప్‌–3 పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో సంబంధిత పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష సెంటర్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పకుండా గుర్తింపుకార్డు, హాల్‌టికెట్ తీసుకురావాలి. పరీక్ష సెంటర్‌లో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని, పరీక్ష సెంటర్‌కు వెళ్లే దారిలో మార్గనిర్దేశం కోసం సూచన బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతీ పరీక్ష కేంద్రానికి 10 మంది పోలీస్ సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు.

పరీక్ష కేంద్రాల వివరాలు

సెంటర్ కోడ్	పరీక్ష కేంద్రం	ప్రదేశం
1401	సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల	ఆసిఫాబాద్
1402	గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల	ఆసిఫాబాద్
1403	గిరిజన బాలికల గురుకుల పాఠశాల	ఆసిఫాబాద్
1404	బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల	ఆసిఫాబాద్
1405	బాలుర ప్రభుత్వం ఉన్నత పాఠశాల	ఆసిఫాబాద్
1406	మాతృశ్రీ డిగ్రీ కళాశాల	ఆసిఫాబాద్
1407	ప్రభుత్వ జూనియర్ కళాశాల, జన్కాపూర్	ఆసిఫాబాద్
1408	సెయింట్ మేరీ ఉన్నత పాఠశాల, జన్కాపూర్	ఆసిఫాబాద్
1409	తెలంగాణ మోడల్ స్కూల్	ఆసిఫాబాద్
1410	సెయింట్ క్లారిస్ట్ స్కూల్ సెంటర్ (ఏ)	కాగజ్‌నగర్
1411	సెయింట్ క్లారిస్ట్ స్కూల్, సెంటర్ (బీ)	కాగజ్‌నగర్
1412	వివేకానంద డిగ్రీ కళాశాల	కాగజ్‌నగర్
1413	జవహర్ నవోదయ విద్యాలయం	కాగజ్‌నగర్
1414	సుప్రబాత్ ప్రైవేట్ ఉన్నత పాఠశాల	కాగజ్‌నగర్
1415	వివేకనంద జూనియర్ కళాశాల	కాగజ్‌నగర్
1416	వసుంధర జూనియర్ కళాశాల	కాగజ్‌నగర్
1417	ఫాతిమా కన్వెంట్ స్కూల్, సెంటర్(ఏ)	కాగజ్‌నగర్
1418	ఫాతిమా కాన్వెంట్ స్కూల్ సెంటర్(బీ)	కాగజ్‌నగర్

మెరుగైన వైద్యం అందించేందుకు కృషి

- అధికారులు, సిబ్బంది, ప్రజల సహకారంతో ముందుకు
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కుమ్రం సీతారాం



కుమ్రం సీతారాం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో పట్టణం, పల్లె అనే తేడా లేకుండా ప్రతీ ఒక్కరికి మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తానని ఇటీవల బాధ్యతలు చేపట్టిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కుమ్రం సీతారాం అన్నారు. ఇటీవల ఆశ్రమ, గురుకుల వసతి గృహాల్లో ఫుడ్ పాయిజన్ సంఘటన, గర్భిణులకు అందించాల్సిన వైద్య సేవలతో పాటు పలు అంశాలపై 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు.

సాక్షి: గురుకుల వసతి గృహాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

డీఎంహెచ్‌వో: విద్యార్థులు అనారోగ్యానికి గురికాకుండా విద్యాశాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పకడ్బందీ చర్యలు తీసుకుంటాం. జాతీయ ఆరోగ్య స్కీం ప్రోగ్రాం ద్వారా ఆర్‌బీఎస్‌కే ప్రత్యేక బృందాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాయి. ఎలాంటి అనుమానాలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే అప్పటికప్పుడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

సాక్షి: నిబంధనలు పాటించని హోటళ్లు, బేకరీలపై ఎలాంటి చర్యలు చేపడతారు?

డీఎంహెచ్‌వో: మార్కెట్‌లో తినుబండారాల విషయంలో నిబంధనలు పాటించకుండా, ఎలాంటి అనుమతులు లేకుండా వ్యాపారం చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తాం. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో బేకరీలు, హోటళ్లలో తనిఖీలు కొనసాగుతున్నాయి.

సాక్షి: గర్భిణుల ఆరోగ్యం విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

డీఎంహెచ్‌వో: గర్భిణుల ఆరోగ్యమే లక్ష్యంగా జాగ్రత్త పడుతున్నాం. గర్భం దాల్చిన 84 రోజుల్లోపు ఏఎన్ఎంల వద్ద ఆన్‌లైన్ చేయించుకోవాలి. క్రమం తప్పకుండా ప్రతీనెల వైద్య పరీక్షలతో పాటు మందులు ఇస్తారు. అంగన్‌వాడీ అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ గర్భిణుల ఆరోగ్యంపై చర్యలు తీసుకుంటున్నాం.

సాక్షి: జిల్లాలో మందుల కొరతపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీఎంహెచ్‌వో: ప్రస్తుతం జిల్లాలో మందుల కొరత ఉన్నమాట వాస్తవమే. ఇటీవలే జిల్లా కేంద్రంలో స్టాక్ రూంను ఏర్పాటు చేశాం. ప్రత్యేక భవనాన్ని ఏర్పాటు చేసేందుకు కలెక్టర్‌కు నివేదించాం. రోగులకు పూర్తిస్థాయిలో మందులు అందించేందుకు కృషి చేస్తాం.

సాక్షి: వైద్యసేవలపై ప్రజలకు మీరిచ్చే భరోసా ఏమిటి?

డీఎంహెచ్‌వో: జిల్లాలోని వైద్యశాఖలో 11 సంవత్సరాలుగా వైద్యసేవలు అందించిన అనుభవంతో కలెక్టర్ ఆదేశానుసారం ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నాం. ముఖ్యంగా అన్ని సబ్ సెంటర్‌లలో పాముకాటు, కుక్కకాటు టీకాలు అందుబాటులో ఉన్నాయి. వైద్యశాఖ, అంగన్‌వాడీ అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషిచేస్తా. ఇందుకు ప్రజల సహకారం కూడా ముఖ్యమే.

'ఆయిల్‌పాం' లక్ష్యసాధనకు ప్రణాళిక



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమ అధికారి అబ్దుల్‌నదీం బుద్దీన్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాకు కేటాయించిన 700 ఎకరాల ఆయిల్‌పాం తోటల ఏర్పాటుకు లక్ష్యాన్ని సాధించే దిశగా అధికారులు పక్కా ప్రణాళికలు రూపొందించాలని జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమ అధికారి ఉబ్దుల్ నదీం బుద్దీన్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైక్రో ఇరిగేషన్ కంపనీ ప్రతినిధులు సకాలంలో రైతుల వ్యవసాయ క్షేత్రాలలో బిందుసేద్య పరికరాలను అమర్చాలని సూచించారు. జాప్యం చేసిన కంపనీలపై చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. సమావేశంలో మ్యాట్రిక్స్ ఆయిల్ పాం కంపనీ ప్రతినిధులు ఉదయ్, గౌతమ్ రమేశ్, ఉద్యానవన అధికారి సుప్రజ, మైక్రో ఇరిగేషన్ కంపనీ ప్రతినిధులు కిరణ్, శ్రీనివాస్ సిబ్బంది ప్రేమ్ కుమార్, ధనుంజయ్, ప్రవీణ్, కార్యాలయ సిబ్బంది ప్రశాంత్, శంకర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

పెంచికల్‌పేట్: వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. శనివారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి చేడ్వాయి, గొంట్లపేట్, ఎల్కపల్లిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, కేజీబీవీ, సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కేజీబీవీని తనిఖీ చేసి విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థినుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వివరించారు. అనంతరం మండల కేంద్రంలో సాగుతున్న ఇంటింటి సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీసీవో మహమూద్ అలీ, ఏడీఏ మనోహర్, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఏవో మనీషా, ఏపీడీ రామకృష్ణ, ఎస్సై కొమురయ్య, ఆయాశాఖల సిబ్బంది ఉన్నారు.

టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీలో చోటు



నియామకపత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌రావు

రెబ్బెన(ఆసిఫాబాద్): టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీలో బీపీఏకు చెందిన నాయకులకు చోటు లభించింది. సెంట్రల్ కమిటీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా సిరిసెట్టి సత్యనారాయణ, సభ్యులుగా కార్నాథం వెంకటేశం, రామగిరి శ్రీనివాస్‌ను నియమించారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని యూనియన్ కార్యాలయంలో బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు నియామకపత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై పోరాడాలని సూచించారు. యూనియన్‌ను బలోపేతం చేస్తూనే కార్మిక సమస్యల పరిష్కారం కోసం బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, అలవేణి సంపత్, మంగీలాల్, సమ్మయ్య, రమేశ్, విద్యాసాగర్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

లైవ్ సర్టిఫికెట్ తప్పనిసరి

- 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌కు అవకాశం
- వచ్చే ఏడాది మార్చి 31 వరకు గడువు
- జిల్లాలో 1,981 మంది ప్రభుత్వ పెన్షన్‌దారులు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వ ఉద్యోగం చేసి రిటైర్ అయినవారు పెన్షన్ పొందాలంటే లైవ్ సర్టిఫికెట్ తప్పనిసరి చేస్తూ గత సంవత్సరమే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లాలో ప్రభుత్వ పెన్షన్‌దారులు 1,981 మంది ఉన్నారు. వారంతా 2024–25 ఆర్థిక సంవత్సరానికి గానూ లైవ్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంది.

ఆన్‌లైన్‌లోనే...

కరోనా నేపథ్యంలో పెన్షన్‌దారులు తమ లైవ్ ధృవీకరణ పత్రాన్ని ఆన్‌లైన్‌లోనే అందించే వెసులుబాటు కల్పించారు. టీ–యాప్, మీసేవ కేంద్రం, జీవన్ ప్రమాణ్, ఆండ్రాయిడ్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో అందజేయాల్సి ఉంటుంది. ఇందుకు 2025 మార్చి 31 వరకు గడువు ఇచ్చారు. ఈలోగా లైవ్ సర్టిఫికెట్ అందజేయకుంటే పెన్షన్ నిలిపివేస్తారు.

నమోదు ఇలా..

ఆండ్రాయిడ్ యాప్‌లో పెన్షన్‌దారులు ఓటరు గుర్తింపుకార్డు, సెల్ఫీతో లైవ్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది. ఓటరు ఐడీ కార్డు లేనివారు ఆధార్ కార్డు ద్వారా మీసేవ కేంద్రాలకు వెళ్లి లైవ్ సర్టిఫికెట్లు తీసుకోవాలి. అంతేకాకుండా ఉద్యోగి మృతి చెందిన తర్వాత భర్త లేదా భార్య కారుణ్య నియామకం కింద ఉద్యోగం పొందితే ఆ వివరాలను కూడా లైవ్ సర్టిఫికెట్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. జీవో 315 ద్వారా పెన్షన్ పొందుతున్న అవివాహిత, వితంతు, విడాకులు తీసుకున్న మహిళలు, మైనర్, ఫ్యామిలీ పెన్షన్‌దారులు రెవెన్యూశాఖ ద్వారా ధృవీకరణ పత్రాలను ట్రెజరీ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. గతేడాది రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు నేరుగా సెల్ఫీదిగి ధృవీకరణ పత్రాన్ని అందజేయవచ్చు . పోస్టుద్వారా వచ్చిన పత్రాలను ఆమోదించరు. అలాగే విదేశాల్లో ఉంటున్నవారు మాత్రమే అక్కడి ఎంబసీ ద్వారా జిల్లా ఖజానా అధికారికి పోస్టు ద్వారా లైవ్ సర్టిఫికెట్లు పంపించాలి. పోస్టు ద్వారా పంపనివి, అసంపూర్తిగా నింపినవి అంగీకరించబడవు. 75 సంవత్సరాలు దాటినవారు వారికి రావాల్సిన అదనపు పెన్షన్ పొందేందుకు ఓటరు ఐడీ, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, పాఠశాల నుండి పొందిన ధృవీకరణ పత్రాలను అందజేయాలి.

సకాలంలో అందజేయాలి

విశ్రాంత ఉద్యోగులు తప్పనిసరిగా మార్చి 31 లోగా ట్రెజరీ కార్యాలయంలో పూర్తి వివరాలతో లైవ్ సర్టిఫికెట్ అందజేయాలి. వివరాలకు జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సంప్రదించాలి. వేలి ముద్రలు పడనివారు నేరుగా కార్యాలయంలో మా న్యువల్‌గా వివరాలు అందించే అవకాశం ఉంది.

– కర్ణాగౌడ్,
విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

మార్చి 31 వరకు గడువు

2025 మార్చిలోగా పెన్షన్‌దారులు తమ లైవ్ సర్టిఫికెట్లు అందజేయాలి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి మాత్రం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి. గడువులోగా సర్టిఫికెట్లు ఇవ్వకుంటే ఏప్రిల్ నుంచి పెన్షన్ నిలిపివేస్తారు. పోస్టుద్వారా వచ్చినవి తిరస్కరిస్తారు. ఓటరు ఐడీ, ఆధార్ కార్డు లేనివారు మీసేవ కేంద్రాల్లో లైవ్ సర్టిఫికెట్ తీసుకుని ట్రెజరీ కార్యాలయంలో అందజేయాలి.

– గోమాస భానుమతి, డీటీవో, ఆసిఫాబాద్

'సమగ్ర' సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

కాగజ్‌నగర్‌రూరల్: ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణనను సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. శనివారం పట్టణంలోని ఈద్గాకాలనీలో నిర్వహించిన సర్వే ప్రక్రియను పరిశీలించారు. నిర్ణీత గడువులోగా పూర్తిచేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో పూర్తి సౌకర్యాలు కల్పించాలి

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు పూర్తి సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మండలంలోని సీతానగర్‌లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టార్పాలిన్ కవర్లు, గన్నీసంచులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తూకం, తేమ యంత్రాలను వినియోగించి నిబంధనల మేరకు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నందువల్ల అధికంగా వచ్చే అవకాశముందన్నారు. చెత్త, తాలు, మట్టిగడ్డలు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసకరావాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, జిల్లా సహకార సంఘం అధికారి రబ్బాని, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి మనోహర్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, తహసీల్దార్ కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

గ్రూపు–3కి పకడ్బందీ ఏర్పాట్లు

ఈనెల 17,18 తేదీల్లో జరగనున్న గ్రూపు–3 పరీక్ష కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 18 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కేంద్రాల్లో ఫర్నీచర్, ఫ్యాన్లు, వెలుతురు సరిగా ఉండేలా చూడాలన్నారు.

'పది'లో మెరుగైన ఫలితాలు సాధించాలి



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన: సింగరేణి పాఠశాల విద్యార్థులు పదోతరగతి పరీక్షల్లో గతంలో కంటే మెరుగైన ఫలితాలు సాధించాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు, చదువుకుంటున్న విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. వసతులను పరిశీలించారు. అనంతరం తరగతిగదుల్లో విద్యార్థులను సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలన్నారు. ప్రత్యేక తరగతుల నిర్వహణతో విద్యార్థుల్లో మెరుగైన ఫలితాల సాధనకు ఆస్కారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, హెచ్‌ఎం రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో రైతు మృతి


పెద్ద భీమయ్య మృతదేహం

దండేపల్లి: మండలంలోని రాజుగూడ జీపీ పరిధిలోని కుంటలగూడ కట్టకు చెందిన రైతు మార్నేని పెద్ద భీమయ్య (49) సోలార్ విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం ..పెద్ద భీమయ్య శనివారం తెల్లవా రుజాము తాను కౌలుకు చేస్తున్న పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. ఉదయం 7 గంటలు దాటిన ఇంటికి రాకపోవడంతో భార్య సత్తవ్వ అక్కడికి వెళ్లింది. సోలార్ వైరు వద్ద విద్యుత్ షాక్ తగిలి కాలిన గాయాలతో భీమయ్య చనిపోయి ఉన్నాడు. మృతుడి కుమారుడు మహేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

తిర్యాణి: బైక్ అదుపుతప్పి గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై మాధవ్ కథనం ప్రకారం..మండలంలోని మోర్రిగూడ గ్రామానికి చెందిన తిరుమల్‌రావు(42) శుక్రవారం రాత్రి పాత సమ్మక్క గద్దల వద్ద బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. భార్య సీతాబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గడ్డి కట్టేమిషన్‌లో చేతులు ఇరుక్కుని గాయాలు

లోకేశ్వరం: గడ్డి కట్టేమిషన్‌లో రెండు చేతులు ఇరుక్కుని ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని రాజేష్‌తండాకు చెందిన రైతు రాథోడ్ మిథున్ శనివారం తన పొలంలో గడ్డికట్టలు కట్టేందు మిషన్‌ను తీసుకెళ్లాడు. గడ్డి కట్టలు కట్టేక్రమంలో దానికి అమర్చిన దారం తెగిపోయింది. సరిచేసే క్రమంలో మిథున్ చేతులు మిషన్‌లో ఇరుక్కుపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతన్ని హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతున్నాడు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య


సందీప్ (ఫైల్)

ఇంద్రవెల్లి: పురుగుల మందు తాగి తాగిన వ్యక్తి ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని దేవాపూర్‌కు చెందిన లొండే సందీప్ వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గతకొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 14న భార్యాభర్తల మధ్య చిన్న గొడవ జరిగింది. ఈక్రమంలో సందీప్ మద్యం మత్తులో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. శనివారం సాయంత్రం చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు సందీప్ మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. తల్లి దయబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య కవిత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

బాసరలో ఉద్రిక్తత

- ట్రిపుల్‌ఐటీ ముట్టడికి ఏబీవీపీ పిలుపు
- భారీగా మోహరించిన జిల్లా పోలీసులు
- రైల్వేస్టేషన్, ఆలయంలో అరెస్టులు
- ట్రిపుల్‌ఐటీ గోడ దూకిన నాయకులు
- ఏఎస్పీ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు


రైల్వేస్టేషన్ వద్ద పోలీసుల అదుపులో ఏబీవీపీ నాయకులు

భైంసా: బాసరలో శనివారం ఉదయం నుంచే ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఏబీవీపీ నాయకులు ట్రిపుల్‌ఐటీని ముట్టడిస్తామని పిలుపునిచ్చారు. ఇటీవల ట్రిపుల్‌ఐటీ విద్యార్థిని పూరి స్వాతిప్రియ ఆత్మహత్య ఘటనపై అక్కడికి వెళ్లిన నాయకులపై సెక్యూరిటీ సిబ్బంది దాడిచేశారు. ఇందులో సాయికుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. దాడికి నిరసనగా ఏబీవీపీ నాయకులు ఇప్పటికే జిల్లాలో ఒకరోజు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. తాజాగా ట్రిపుల్‌ఐటీ ముట్టడికి నిర్ణయించారు. హైదరాబాద్, కామారెడ్డి, నిజామాబాద్ తదితర ప్రాంతాల నుంచి నాయకులు వస్తున్నారన్న సమాచారం ఇంటలిజెన్స్ అధికారులు చేరవేశారు. అప్రమత్తమైన ఎస్పీ జానకీషర్మిల..పోలీసులను మోహరించేలా చర్యలు తీసుకున్నారు. భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు.

వేకువజాము అరెస్టులు

బాసర రైల్వేస్టేషన్‌లో ఉదయం 4 గంటల సమయంలో తాండూరు రైలుకు 50 మందికిపైగా ఏబీవీపీ నాయకులు దిగారు. స్టేషన్‌లో పోలీసు సిబ్బంది వారిని అదుపులో తీసుకున్నారు. ఏబీవీపీ చలో బాసర ట్రిపుల్‌ఐటీ ముట్టడికి తరలివచ్చే వారిని అదుపులో తీసుకునేందుకు ముందుగా ఆటోలను సిద్ధంగా ఉంచారు. వేకువజామున అరెస్టుల పరంపర కొనసాగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సికింద్రాబాద్ నుంచి మహారాష్ట్ర వెళ్లే రైళ్లలో బాసర స్టేషన్‌లో దిగిన వారిని క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానం ఉన్న నాయకులను, విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. తాము వేరే పనిమీద వచ్చామని చెప్పినా వినిపించుకోలేదు. స్టేషన్‌లో ఏమి జరుగుతుందో విషయం తెలియక యాత్రికులు కొంత అయోమయానికి గురయ్యారు. తాండూరు, సంబాల్‌పూర్, నాందేడ్ ప్యాసింజర్ రైళ్లలో దిగిన యాత్రికులను తనిఖీలు చేశారు. కొందరు విద్యార్థులు బాసర ఆలయంలో సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడికి వెళ్లిన పోలీసులు వారిని లాక్కెళ్లి స్టేషన్‌కు తరలించారు. బాసర అంతటా పోలీసులు మోహరించడంతో ఏమి జరుగుతుందోనని అంతా హైరానా పడ్డారు.

భారీ భద్రత..

బాసర ట్రిపుల్‌ఐటీలో భారీ భద్రత ఏర్పాటు చేశారు. ప్రధాన ద్వారం వద్ద ఐడీకార్డులు ఉన్న విద్యార్థులనే లోనికి పంపించారు. అనుమానం ఉన్న ఏబీవీపీ నాయకులను, విద్యార్థులను అదుపులో తీసుకున్నారు. భైంసా, ముధోల్, కుంటాల, నిర్మల్, పెంబి, బాసర పోలీస్ స్టేషన్లకు విద్యార్థులను తరలించారు. బాసర క్యాంపస్‌లోకి కొత్తవారిని అనుమతించలేదు. ఎక్కడ యువకులు కనిపించిన పోలీసులు అక్కడికి వెళ్లి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ జానకీషర్మిల.. ఎప్పటికప్పుడు భద్రతపై ఆరా తీశారు.

గోడ దూకి..

మహారాష్ట్ర వైపు నుంచి వచ్చిన ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు ట్రిపుల్‌ఐటీ గోడ దూకి లోనికి వెళ్లారు. అప్రమత్తమైన సిబ్బంది వారిని అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మరోవైపు ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి వచ్చేవారిని ముధోల్ వద్ద అదుపులోకి తీసుకున్నారు.


ఏబీవీపీ నాయకులను అదుపులో తీసుకుంటున్న పోలీసులు


రైల్వేస్టేషన్‌లో పోలీసులు


బాసరలో ఏబీవీపీ నాయకులను లాకెళ్తున్న పోలీసులు

పార్లమెంట్ హౌస్‌లో కళాకారుల ప్రదర్శన


రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్‌తో ఆదివాసీ కళాకారులు

ఇచ్చోడ: మండలంలోని దుబార్‌పేట్‌కు చెందిన సకల కళా సంక్షేమ సంఘం ఆదివాసీ కళాకారులు శుక్రవారం రాత్రి ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ప్రదర్శన చేశారు. గుస్సాడీ, డెంసా తదితర నృత్యాలు ప్రదర్శించారు. బిర్సాముండా జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఈ ప్రదర్శన ఇచ్చారు. రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాలు కళాకారులను అభినందించారని సకల కళా సంక్షేమ డైరెక్టర్ కాత్లె శ్రీధర్ తెలిపారు.

స్క్రాప్ తరలిస్తున్న వాహనం పట్టివేత

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలో ఎంసీసీ కంపెనీకి చెందిన స్క్రాప్‌ను దొంగిలించి అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఎంసీసీ కంపెనీకి చెందిన ఇనుపసామగ్రి(స్క్రాప్)ను దొంగిలించి బొలెరో వాహనంలో ర్యాలీ ఘడ్‌పూర్ వైపు తరలిస్తున్నారు. కంపెనీకి చెందిన పెట్రోలింగ్‌లో ఉన్న సెక్యూరిటీ సిబ్బంది శనివారం ఉదయం ఆపే ప్రయత్నం చేశారు. స్క్రాప్ దొంగలు కొంత దూరం వెళ్లాక వాహనాన్ని వదిలేసి పారిపోయారు. వాహనంలో క్వింటాల్ ఇనుప సామగ్రిని గుర్తించి సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. సెక్యూరిటీ సిబ్బంది ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మూగజీవాల వేటగాళ్లపై చర్యలు

- ఎఫ్ఆర్వో రత్నాకర్‌రావు


మాట్లాడుతున్న ఎఫ్ఆర్వో రత్నాకర్‌రావు

మందమర్రిరూరల్: మూగజీవాల వేటగాళ్లపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎఫ్ఆర్వో రత్నాకర్‌రావు హెచ్చరించారు. మండలంలోని సారంగపల్లి పంచాయతీ శివారు గల దుబ్బపల్లి అటవీప్రాంతంలో రెండు గేదెలు వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు బలైన విషయం తెలుసుకుని శనివారం ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో వేటగాళ్లు మూగజీవాల కోసం సుమారు 600 మీటర్ల విద్యుత్ తీగలు అమర్చారని తెలిపారు. అనుమానం ఉన్న సండ్రోన్‌పల్లికి చెందిన ఐదుగురిని గుర్తించామన్నారు. వారి ఇళ్లకు వెళ్లి తనిఖీ చేయగా ఒకరిని అదుపులో తీసుకున్నామని తెలిపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. ఆయన వెంట డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సంతోష్, ఎఫ్‌బీవో రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

అటవీ ప్రాంతమంతా గాలింపు

చెన్నాపూర్ శివారులో పులి సంచరిస్తుందనే పుకారుతో శనివారం సిబ్బందితో కలిసి అటవీ ప్రాంతమంతా గాలించినట్లు ఎఫ్ఆర్వో రత్నాకర్‌రావు తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన పత్తి సేకరించడానికి వచ్చిన కూలీలకు ఏదో జంతువు కనబడితే దానినే పులిగా చెప్పుకొచ్చినట్లు పేర్కొన్నారు. ప్రజలు అటవీప్రాంతంలోకి వెళ్లొద్దన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే సమూహంతో వెళ్లాలని ఏదైనా పులి తిరిగినట్లు పాదముద్రలు కనిపిస్తే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

గడ్డి వ్యాన్ దగ్ధం


దగ్ధమవుతున్న వ్యాన్

జన్నారం: మండలంలోని కామన్‌పల్లి సమీపంలో గడ్డి లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని పొనకల్‌కు చెందిన డ్రైవర్ దుర్గం రవి శనివారం కవ్వాల్ నుంచి గడ్డి కొనుగోలు చేసుకుని వ్యాన్ లోడ్‌తో ఆదిలాబాద్ గోశాలకు వెళ్తున్నాడు. కామన్‌పల్లి నుంచి ప్రధాన కెనల్ మీదుగా కొంత దూరం వెళ్లగా 11 కేవీ విద్యుత్ లైన్ తీగలు మధ్యలో ఉన్నాయి. కర్రతో పైకి లేపే క్రమంలో రెండు వైర్లు తగిలి గడ్డికి మంటలు అంటుకున్నాయి. గడ్డితోపాటు వ్యాన్ దగ్ధమైంది. స్థానికులు గమనించి ఫైర్ అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. రోడ్డు బాగాలేకపోవడంతో అగ్నిమాపక వాహనం దూరంగా ఆపాల్సి వచ్చిందని ఫైర్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని జాతీయ రహదారి 44కు అనుకుని ఉన్న ఓ దాబా హోటల్ సమీపంలో 8.40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఏఎస్సై సునీత తెలిపారు. ఆమె కథనం ప్రకారం..శుక్రవారం జాతీయ రహదారి 44పై వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రకు రెండు ఆటోల్లో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. బియ్యం తరలిస్తున్న నలుగురి వద్ద నుంచి సెల్‌ఫోన్లు, రెండు ఆటోలు, బియ్యాన్ని స్వాధీనంచేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రిమ్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జైసింగ్ రాథోడ్

తాంసి: రిమ్స్ ఆధ్వర్యంలో ఐదేళ్ల పాటు అందించే వైద్యసేవలను పొన్నారి గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. రిమ్స్‌లో నూతనంగా చేరిన మెడికోల ఆధ్వర్యంలో గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. కార్యక్రమాన్ని డైరెక్టర్‌తో పాటు కళాశాల ప్రిన్సిపాల్ విద్యవిల్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలో ప్రతీ ఐదు కుటుంబాలకు ఒక వైద్యుడిని నియమించి ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ సేవలు ఐదేళ్ల పాటు ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించారు. ఇందులో మాజీసర్పంచ్ అశోక్, మాజీ ఎంపీటీసీ రేఖ, వైద్యాధికారి శ్రావ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు


క్రీడాకారులతో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో మూడు రోజుల్లో జరిగే రాష్ట్రస్థాయి అండర్–17 బాల, బాలికల బేస్‌బాల్ పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 8 జిల్లాల నుంచి 8 జట్లు, 280 మంది క్రీడాకారులు, 16 మంది కోచ్‌లు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, సమత ఫౌండేషన్ చైర్మన్ సుదర్శన్ జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మల్‌లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులు ఆటల్లో సత్తా చాటి జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎస్జీఎఫ్ సెక్రెటరీ రవీందర్‌గౌడ్, ఆర్గనైజర్ వన్నెల భూమన్న, వ్యాయామ ఉపాధ్యాయులు భోజన్న, అన్నపూర్ణ, జమున, కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

కొడుకుపై కత్తితో తండ్రి దాడి

- మద్యంమత్తులో ఘర్షణ
- రిమ్స్ ఆస్పత్రికి తరలింపు


రిమ్స్‌లో వైద్యం పొందుతున్న మెస్రం బాలాజీ

నార్నూర్: మద్యంమత్తులో తండ్రికొడుకులు ఘర్షణ పడ్డారు. ఆవేశానికి లోనైన తండ్రి కత్తితో కొడుకుపై దాడి చేశాడు. ఈ సంఘటన ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం గుంజాల గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మెస్రం భుజంగ్‌రావు, ఆయన కుమారుడు మెస్రం బాలాజీ వ్యవసాయం చేస్తుంటారు. తాగిన మైకంలో ప్రతీరోజు గొడవ పడుతుండేవారు. శనివారం వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన తర్వాత మద్యంమత్తులో ఇద్దరూ ఘర్షణ పడ్డారు. దీంతో భుజంగ్‌రావు కత్తితో బాలాజీని కడుపులో పొడిచాడు. తీవ్ర గాయం కావడంతో అతడిని కుటుంబ సభ్యులు ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలాజీ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై సీఐ రహీంపాషాను సంప్రదించగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు. కాగా, ఏ విషయమై ఇద్దరి మధ్య ఘర్షణ జరిగిందనే వివరాలు తెలియరాలేదు.

వృద్ధాశ్రమానికి తరలింపు

సాక్షి ఎఫెక్ట్..


వృద్ధుడిని తరలిస్తున్న ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

మందమర్రిరూరల్: 'అందరూ ఉన్నా..అనాథలా'శీర్షికన ఈనెల 13న సాక్షిలో ప్రచురితమైన కథనానికి శనివారం ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు స్పందించారు. పట్టణానికి చెందిన వృద్ధుడు తిరుపతిరెడ్డి వద్దకు వెళ్లి వివరాలు సేకరించి మంచిర్యాలలోని వృద్ధాశ్రమానికి తరలించారు. కుటుంబసభ్యులతో మాట్లాడి అతన్ని వృద్ధాశ్రమానికి తరలించామని సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు అజీమొద్దీన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ పట్టణ అధ్యక్షుడు నందిపాటి రాజ్‌కుమార్, కార్యదర్శి గాండ్ల సంజీవ్ పటేల్, జావీద్‌నపాషా, దిలీప్, చందు ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


పరిశీలిస్తున్న ఎస్సై రాహుల్ గైక్వాడ్

ఖానాపూర్: పట్టణంలో ని రాజీవ్‌నగర్ కాలనీలో తాళంవేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఎస్సై రాహుల్ గైక్వాడ్ కథనం ప్రకారం..ముక్కెర రాజేశ్వర్‌గౌడ్ నివాసంలోని పై పోర్షన్‌లో తాళం వేసిన ఇంట్లోకి దొంగలు చొరబడి రూ.10 వేల నగదు, ఐదు మద్యం బాటిళ్లు, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లారు. అదే కాలనీలోని కమటం రవీందర్, కొల్లూరి రాజు, రాపెల్లి రవి, ఆర్ విజయలక్ష్మి ఇళ్లల్లో చోరీకి యత్నించారు. సమాచారం అందుకున్న ఎస్సై అక్కడికి చేరుకుని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. క్లూస్‌టీంలతో కలిసి విచారణ చేపట్టారు. రాజేశ్వర్‌గౌడ్ ఫిర్యాదుతో శనివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాకింగ్ చేస్తుండగా సెల్‌ఫోన్ చోరీ

భైంసాటౌన్: ఫోన్‌లో మాట్లాడుతూ నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి సెల్‌ఫోన్‌ను చోరీ చేసిన ఘటన పట్టణంలో జరిగింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా చేస్తున్న రాంచందర్ శనివారం సాయంత్రం భైంసా–నిర్మల్ మార్గంలో ఖద్ద హోటల్ ప్రాంతంలో వాకింగ్ చేస్తూ ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని దుండగుడు ఫోన్ లాక్కుని పారిపోయాడు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపాడు.

వరికోతకు వేళాయె..!

- నన్నద్ధమవుతున్న రైతులు • వారంలో జోరందుకునే అవకాశం


కోతకు వచ్చిన వరిపంట

బెల్లంపల్లి: వానాకాలం సీజన్‌లో సాగు చేసిన వరిపంట కోతకు సిద్ధమైంది. ప్రస్తుతం అక్కడక్కడ కోతలు ప్రారంభం కాగా, మరో వారంలో జోరందుకోనున్నాయి. ఇందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 7 మండలాలు, రెండు వ్యవసాయ డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 60 వేల పైచిలుకు ఎకరాల్లో వరి పంట సాగైనట్లు అధికారుల లెక్కలు వెల్లడిస్తున్నాయి. సీజన్ ప్రారంభంతోనే ఇతర ప్రాంతాల నుంచి హార్వెస్టర్లను లీజుకు తీసుకువచ్చి వరి కోతలు చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పత్తితీతకు వెళ్తున్న కూలీలు

వరి కోతలు రాకముందే కూలీలు గ్రామాల్లో పత్తితీత పనులకు వెళ్తున్నారు. కిలో చొప్పున లెక్కకట్టి కూలీ చెల్లిస్తుండటంతో అక్కడికి వెళ్లేందుకు మొగ్గు చూపుతున్నారు. వరి కోత పనులకు వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. ఐదారేళ్ల నుంచి రైతులు హార్వెస్టర్లపై ఆధారపడాల్సి వస్తోంది. ఇదే అదునుగా లీజుకు తీసుకువచ్చిన రైతులు హార్వెస్టర్ల అద్దె ధరకు ఏటా రూ.వందల్లో పెంచుతున్నారు. అద్దె ధర అధికమైనప్పటికీ హార్వెస్టర్లతో వరికోత పనులు పూర్తి చేసుకుంటున్నారు. ప్రస్తుతం వీటి పనులు మొదలు కానుండటంతో గ్రామాల్లో సందడి నెలకొననుంది.

కూలీలు రావడం లేదు

వరి కోతలకు ఏటా కూలీల సమస్య ఏర్పడుతోంది. గ్రామాల్లో పత్తి తీత పనులు సాగుతున్నాయి. వరికోత పనులకు కూలీలకు రావడం లేదు. హార్వెస్టర్లపై ఆధారపడాల్సి వస్తుంది.

– గోమాస మల్లయ్య, రైతు, బెల్లంపల్లి మండలం